నమస్తే తెలంగాణ
# జిందగీ
ఆదివారం | 20 ఏప్రిల్ 2025 | 5
కరీంనగర్ | www.ntnews.com



## అంత సులువు కాదు

**హీరోయిన్‌గా** రాణించడం అంటే అంత సులువు కాదని అంటున్నది బాలీవుడ్ బ్యూటీ దియా మిర్జా. భావోద్వేగాల పరంగా, శారీరకంగానూ ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని చెబుతున్నది. మిస్ ఆసియా పసిఫిక్ కిరీటాన్ని గెలుచుకొని.. బాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా ఎదిగింది ఈ హైదరాబాదీ. 2019లో వచ్చిన 'కాఫిర్' అనే వెబ్ సిరీస్ షూటింగ్ సందర్భంగా తనకు ఎదురైన చేదు అనుభవాన్ని తాజాగా మీడియాతో పంచుకున్నది. ''కాఫిర్ కోసం ఓ సన్నివేశాన్ని చిత్రీకరించడానికి ఎంతో కష్టపడ్డాం. ఒక సమయంలో వాంతులు కూడా చేసుకున్నా!'' అంటూ చెప్పుకొచ్చింది. ''ఈ టీవీ వెబ్ సిరీస్‌లోని అత్యాచారం సన్నివేశం నాకింకా గుర్తుంది. అందులో నటించడం చాలా కష్టంగా అనిపించింది. ఆ సీన్ తర్వాత నా కాళ్లు, చేతులు విపరీతంగా వణికిపోయాయి. సీక్వెన్స్ షూట్ చేశాక వాంతులు కూడా చేసుకున్నా. అలాంటి సీన్లు చేయడం భావోద్వేగపరంగా, శారీరకంగా చాలా కష్టంగా ఉంటాయి'' అంటూ నాటి సంగతులను గుర్తు చేసుకున్నది. 'కాఫిర్'లోని 'కైనాజ్' పాత్ర.. తాను ఒక వ్యక్తిగా ఎదగడానికి సహాయపడిందనీ, నిజ జీవితంలో తల్లిగా మారడానికి ముందే తనలో తల్లి భావాలను నింపిందని ఆ పాత్రను ఆకాశానికెత్తింది. షెహనాజ్ పర్వీన్ అనే పాకిస్థాన్ మహిళ ఎదుర్కొన్న సంఘటనల ఆధారంగా 'కాఫిర్' టీవీ వెబ్ సిరీస్‌ను తెరకెక్కించారు. 2019లో ప్రసారమైన ఈ సిరీస్‌లో దియా మీర్జా, మోహిత్ రైనా ప్రధాన పాత్రలు పోషించారు. మొత్తం 8 ఎపిసోడ్లతో వచ్చిన ఈ సిరీస్‌కు నాటి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఇప్పుడు ఈ సిరీస్‌ను సినిమాగా మార్చి ఇటీవల ఓటీటీలో రిలీజ్ చేశారు.





## క్లాసిక్.. క్లాసిక్కే!

**''ఫ్యాషన్** ప్రపంచంలో రోజుకో ట్రెండ్ వచ్చినా.. క్లాసిక్ ఎప్పటికీ క్లాసిక్కే!'' అంటున్నది బాలీవుడ్ నటి శ్వేతా త్రిపాఠి. 'మిర్జాపూర్' వెబ్‌సిరీస్‌లో 'గోలు'గా దేశవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్నది. ఇటీవలే నిఫ్ట్ (ఎన్ఐఎఫ్‌టీ) నుంచి 'ఫ్యాషన్ కమ్యూనికేషన్'లో డిగ్రీ పట్టా పొందింది. ఈ సందర్భంగా ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. ఫ్యాషన్, ట్రెండ్స్ గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నది. ఫ్యాషన్ స్కూల్లో చేరడం తన జీవితాన్ని పూర్తిగా మార్చేసిందని చెబుతున్నది. అనేక విషయాల పట్ల తన దృక్పథంలోనూ మార్పు వచ్చిందనీ అంటున్నది. ''నేను ఎలా ఉండాలి? ఎలా కనిపించాలి? అనేది పూర్తిగా నా



ఇష్టం! నా లుక్స్‌కు నేనే బాస్! అందుకే, ఏదైనా ఫ్యాషన్ ట్రెండింగ్‌లో ఉన్నదంటే.. దాన్ని తప్పకుండా ఫాలో కావాల్సిన అవసరం లేదని అనుకుంటా. నేనెప్పుడూ అలాంటి నియమం పెట్టుకోలేదు కూడా. కాకుంటే.. ఫ్యాషన్ ట్రెండ్స్‌ను మాత్రం గమనిస్తుంటా. నాకు ప్రయత్నించాలని అనిపిస్తే.. కచ్చితంగా చేస్తా!'' అంటూ చెప్పుకొచ్చింది. ''అప్పుడప్పుడూ మన వ్యక్తిత్వానికి సరిపోని, మనకు అన్‌ఫిట్ అయ్యే ఫ్యాషన్ ట్రెండింగ్‌లోకి వస్తుంది. అలాంటప్పుడు దాన్ని దూరం పెడతా! కానీ, నా స్నేహితులకు సరిపోతుందని భావిస్తే.. తప్పకుండా వారికి పంపిస్తా! మా అత్తగారికి నప్పుతాయని అనిపిస్తే.. ఆవిడతోనూ పంచుకుంటా!'' అని చెబుతున్నది. తనకు ఫ్యాషన్ రంగంలో ప్రయోగాలు చేయడమంటే ఇష్టమనీ, అదృష్టవశాత్తూ తన వృత్తికూడా అందుకు సహకరిస్తుందని అంటున్నది. ప్రొడక్షన్ అసిస్టెంట్, అసోసియేట్ డైరెక్టర్‌గా సినీరంగంలోకి అడుగుపెట్టింది శ్వేతా త్రిపాఠి. 2015లో 'మసాన్'తో వెండితెరపై కనిపించింది. ఇక 2018లో వచ్చిన మిర్జాపూర్ సిరీస్.. ఆమె యాక్టింగ్ కెరీర్‌నే పూర్తిగా మార్చేసింది. రాత్ అకేలి హై, కార్గో, హరాంఖోర్ చిత్రాల్లో అద్భుత నటన కనబర్చి.. విమర్శకుల ప్రశంసలు అందుకున్నది. చివరిగా విపుల్ మెహతా దర్శకత్వం వహించిన 'కంజూస్ మఖిచూస్' చిత్రంలో కనిపించింది.

## పాజిటివ్‌గా ఉండండ్రా

**తనపై** వచ్చిన బాడీ షేమింగ్ కామెంట్స్‌పై అదిరిపోయే రిప్లయ్ ఇచ్చింది బాలీవుడ్ నటి కరిష్మా తన్నా. 'పాజిటివ్‌గా ఉండండి. సోషల్ మీడియాను ఎదుటివారి ఎదుగుదల కోసం ఉపయోగించండి. వారిని తొక్కేయడానికి కాదు' అంటూ ఘాటుగా స్పందించింది. ఇటీవలి బొంబాయి టైమ్స్ ఫ్యాషన్ వీక్‌లో.. డిజైనర్ లెహంగా వేసుకొని ర్యాంప్‌వాక్ చేసింది కరిష్మా. స్టయిలిస్ట్, డిజైనర్ అయిన అభినిసా మీనన్.. ఇందుకు సంబంధించిన వీడియో ఫుటేజ్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. 'బ్యాడ్ స్టయిలింగ్‌కు ఈ వీడియో మంచి ఉదాహరణ' అంటూ క్యాప్షన్ పెట్టింది. అందులో కరిష్మా బొద్దుగా కనిపిస్తున్నదనీ, ఆమె నడుముకు రెండువైపులా ఉబ్బిపోయినట్లు కనిపిస్తున్నదనీ రాసుకొచ్చింది. 'ట్రెండ్స్‌ను ఫాలో అయ్యేముందు టైలరింగ్‌ను ఫాలో కావాలి' అంటూ హితబోధ చేసింది. ఈ వ్యాఖ్యలపై కరిష్మా కూడా ఘాటుగానే స్పందించింది. 'మీ దగ్గర ఎక్కువ ఖాళీ సమయం, ఇంకా ఎక్కువ నెగెటివిటీ ఉన్నట్లుంది. అందుకే, ఇలాంటి చౌకబారు పోస్ట్‌లు పెడుతున్నారు. ఇలాంటివారికి ఎప్పుడూ పక్కవారిమీదే ధ్యాస. ఆమె బరువు తగ్గిందనో.. ఆమె అందంగా కనిపిస్తోందనో.. ఆమె బొటాక్స్ చేయించుకుని ఉండాల్సిందనో.. ఆమె బరువు పెరిగిందనో.. కామెంట్ చేస్తుంటారు. కానీ, ఎదుటివారికీ మనసుంటుందనీ, దానిని నొప్పించకూడదని మాత్రం తెలియదు' అంటూ విమర్శించింది. పాజిటివ్‌గా ఉండమంటూ సలహా ఇచ్చింది. దీన్ని చూసిన కొందరు నెటిజన్లు నెగెటివ్ కామెంట్స్ పెడుతుంటే.. మరికొందరు కరిష్మాకు మద్దతుగా నిలుస్తున్నారు. 2001లో టెలివిజన్ రంగంలోకి అడుగుపెట్టిన కరిష్మా తన్నా.. నటిగా, మోడల్‌గా రాణిస్తున్నది. 2014లో బిగ్ బాస్–8 ద్వారా ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. ఇందులో మొదటి రన్నరప్‌గా నిలిచింది. 2020లో ఫియర్ ఫ్యాక్టర్ : ఖత్రోన్ కే ఖిలాడి–10లో విజేతగా నిలిచింది. ఇక సినిమాల విషయానికి వస్తే.. 2006లో వచ్చిన దోస్తీ : ఫ్రెండ్స్ ఫరెవర్ చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసింది. అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించింది. హన్సల్ మెహతా నెట్‌ఫ్లిక్స్ టీవీ సిరీస్.. స్కూప్ (2023)లో ఆమె నటనకు విమర్శకుల ప్రశంసలు అందుకుంది.



**సినిమా విజయాన్ని ప్రభావితం చేసే అంశాల్లో 'కాంబినేషన్ సెటప్' కూడా ఒకటి. మంచి కాంబినేషన్ కుదిరితే చాలు సినిమా సగం విజయం సాధించినట్టే అన్నది ఇండస్ట్రీ మాట. ప్రస్తుతం ఉన్న పాన్ ఇండియా ట్రెండ్‌లో ఈ కాంబినేషన్ క్రేజ్ మరింత ఎక్కువైంది. అయితే ఒక్కోసారి అనూహ్యమైన కలయికలు తెరపైకి వచ్చి ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరుస్తాయి. ఇటీవల టాలీవుడ్‌లో వచ్చిన కొన్ని సినిమా ప్రకటనలు ఆయా ప్రాజెక్ట్‌లపై ఒక్కసారిగా హైప్‌ను తీసుకొచ్చాయి. సెట్స్‌పైకి వెళ్లకముందే టాక్ ఆఫ్ ద టౌన్‌గా నిలిచాయి. అలాంటి ఇంట్రెస్టింగ్ కాంబోస్, వాటి వెనకున్న విశేషాలేమిటో తెలుసుకుందాం..**


# సూపర్ కాంబో..

**'దసరా'** సినిమాతో ఇండస్ట్రీలో సెన్సేషన్ క్రియేట్ చేశాడు దర్శకుడు శ్రీకాంత్ ఓదెల. హీరో నాని కెరీర్‌లో తొలిసారి వందకోట్లు సాధించిన చిత్రమిది. ప్రస్తుతం వీరిద్దరి కలయికలో హైదరాబాద్ పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో 'ప్యారడైజ్' తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా పూర్తయిన వెంటనే చిరంజీవితో సినిమా చేయడానికి సిద్ధమవుతున్నాడు శ్రీకాంత్ ఓదెల. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ ఇండస్ట్రీలో సంచలనంగా మారింది. హీరో నాని ఈ సినిమా నిర్మాణంలో భాగస్వామి కావడం మరో విశేషం. డిసెంబర్‌లో ఈ సినిమా అధికారిక ప్రకటన వెలువడింది. ఇక అప్పటి నుంచి మెగా అభిమానులు అప్‌డేట్స్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అనౌన్స్‌మెంట్ రోజున 'హీ ఫైండ్స్ పీస్ ఇన్ వయొలెన్స్' అనే పోస్టర్‌తోనే సినిమాలో చిరంజీవి పాత్ర ఎంత ఇంటెన్స్‌తో ఉండబోతున్నదో హింట్ ఇచ్చాడు దర్శకుడు. మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లోనే మోస్ట్ వయొలెంట్ ఫిల్మ్‌గా తెరకెక్కనున్నదని ఫిల్మ్ వర్గాల్లో వినిపిస్తున్నది. ఈ సంవత్సరాంతంలో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనుంది.



### ప్రభాస్.. బ్రహ్మ రాక్షస

అగ్ర హీరో ప్రభాస్ లైనప్‌లో 'రాజా సాబ్', 'ఫౌజీ', 'స్పిరిట్' వంటి భారీ సినిమాలున్నాయి. వీటితో పాటు 'హనుమాన్' ఫేమ్ ప్రశాంత్‌వర్మతో 'బ్రహ్మ రాక్షస' పేరుతో ఓ సినిమా చేయబోతున్నాడు. మైథలాజికల్ టచ్ ఉన్న పీరియాడిక్ ఫిల్మ్ ఇదని సమాచారం. దర్శకుడు ప్రశాంత్‌వర్మ తొలుత ఈ కథను బాలీవుడ్ హీరో రణవీర్‌సింగ్‌కు వినిపించగా ఆయన ఓకే చేశారు. కొంతమేర కథా చర్చలు కూడా జరిగాయి. కానీ అనివార్య కారణాల వల్ల రణవీర్‌సింగ్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకొన్నారని తెలిసింది. ఆ తర్వాత ఈ కథ ప్రభాస్‌ను చేరింది. ఆయన ఈ సినిమాకు సూత్రప్రాయంగా అంగీకరించారని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్నది. రానున్న రెండేళ్లపాటు ప్రభాస్ డైరీ ఫుల్ అయిపోయింది. 'స్పిరిట్'తో పాటు 'కల్కి–2', 'సలార్–2' చిత్రాలను పూర్తి చేయాల్సి ఉంది. ఈ మూడు పూర్తయిన తర్వాతే 'బ్రహ్మ రాక్షస' సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని అంటున్నారు. అంటే 2027లో ఈ సినిమా కార్యరూపం దాల్చే అవకాశం ఉందన్నమాట. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ బాధ్యతను తీసుకోవచ్చని టాక్.



### ఎన్టీఆర్.. రాక్

ఇటీవలే 'డ్రాగన్' (వర్కింగ్ టైటిల్) సెట్‌లోకి ఎంటరయ్యారు ఎన్టీఆర్. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నది. దీని తర్వాత 'దేవర–2' చేయాల్సి ఉంది. తమిళస్టార్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్‌తో ఎన్టీఆర్ ఓ సినిమా సన్నాహాల్లో ఉన్న విషయం తెలిసిందే. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించనుంది. తమిళంలో మోస్ట్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా నెల్సన్ దిలీప్‌కుమార్‌కు పేరుంది. దళపతి విజయ్, రజనీకాంత్‌లతో బీస్ట్, జైలర్ వంటి బ్లాక్‌బస్టర్ హిట్స్ ఆయన ఖాతాలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్–నెల్సన్ దిలీప్‌కుమార్ మూవీపై దక్షిణాదిలో భారీ హైప్ ఏర్పడింది. ఈ సినిమాకు 'రాక్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను పెట్టబోతున్నట్టు సోషల్‌మీడియాలో వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం నెల్సన్ దిలీప్‌కుమార్ రజనీకాంత్‌తో 'జైలర్–2' తెరకెక్కిస్తున్నారు. ఇది పూర్తయిన తర్వాత ఆయన ఎన్టీఆర్ ప్రాజెక్ట్‌పై దృష్టి పెడతారని తెలిసింది. వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని సమాచారం.

### అల్లు.. అట్లీ..

అల్లు అర్జున్– అట్లీ కాంబినేషన్‌లో పాన్ వరల్డ్ సినిమా ప్రకటన ఇటీవలే వెలువడింది. హాలీవుడ్ స్థాయి హంగులతో సన్‌పిక్చర్స్ సంస్థ దీన్ని నిర్మించనుంది. 'పుష్ప' ఫ్రాంచైజీ తర్వాత అల్లు అర్జున్ నటిస్తున్న చిత్రమిదే కావడంతో దేశవ్యాప్తంగా క్రేజ్ ఏర్పడింది. ఈ సినిమా కథ గురించి అనేక కథనాలు ప్రచారమవుతున్నాయి. ఓ ఇంటర్నేషనల్ డాన్ చుట్టూ ఈ కథ నడుస్తుందని తమిళ మీడియాలో వార్తలు వచ్చాయి. భారతీయ మూలాల నేపథ్యంలో సూపర్‌హీరో కథాంశం ఇదని మరికొందరు చెబుతున్నారు. ఈ సంవత్సరాంతంలో ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది.

### పూరి.. సేతుపతి

ఇటీవలి కాలంలో ఇండస్ట్రీలో అందరినీ ఆశ్చర్యపరచిన అనౌన్స్‌మెంట్ విజయ్ సేతుపతి– పూరి జగన్నాథ్ కాంబో సినిమానే. తమిళంలో విలక్షణ నటుడిగా విజయ్ సేతుపతికి పేరుంది. గత ఏడాది 'మహారాజ' చిత్రంతో భారీ విజయాన్ని సాధించాడు. పూరి చెప్పిన కాన్సెప్ట్‌లోని కొత్తదనం, తన పాత్రను డిజైన్ చేసిన విధానం నచ్చడంతో విజయ్ సేతుపతి ఈ సినిమాకు వెంటనే అంగీకరించాడని తెలిసింది. ఈ సినిమా కోసం పూరి జగన్నాథ్ పవర్‌ఫుల్ కథ రాశాడని, విజయ్ సేతుపతి నెవర్ బిఫోర్ క్యారెక్టర్ చేయబోతున్నాడని మేకర్స్ ఇటీవలే ప్రకటించారు. జూన్‌లో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నారు.







### రవితేజ.. కిషోర్

రవితేజ నుంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ వచ్చి చాలా కాలమైంది. దీంతో ఆయన పూర్తిస్థాయి కుటుంబ కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. ఈ చిత్రానికి కిషోర్ తిరుమల దర్శకత్వం వహిస్తాడని సమాచారం. నేను శైలజ, ఉన్నది ఒకటే జిందగీ, ఆడవాళ్లు మీకు జోహార్లు వంటి చిత్రాలతో కిషోర్ తిరుమల ఫీల్‌గుడ్ చిత్రాల దర్శకుడిగా పేరు తెచ్చుకున్నాడు. ఆయన రవితేజ వంటి మాస్ హీరోను డైరెక్ట్ చేయబోతుండటం విశేషం. రవితేజ కోసం వినోదాత్మకంగా సాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను సిద్ధం చేశాడని, ఇందులో ఇద్దరు కథానాయికలకు చోటు ఉంటుందని సమాచారం. ప్రస్తుతం రవితేజ 'మాస్ జాతర' చిత్రాన్ని చేస్తున్నాడు. దీని తర్వాత కిషోర్ తిరుమల చిత్రం పట్టాలెక్కనుందని సమాచారం.

... సినిమా డెస్క్

## సముద్రంపై సాహసం!

### కింగ్‌స్టన్

**జీ5 :** స్ట్రీమింగ్ అవుతోంది.
**తారాగణం :** జీవీ ప్రకాష్, దివ్య భారతి, చేతన్, అళగం పెరుమాళ్ తదితరులు, **దర్శకత్వం :** కమల్ ప్రకాష్

**సముద్రంలో** హీరో సాహసయాత్ర.. చెప్పలేని థ్రిల్‌ని పంచుతుంది. అతని సాహసానికి హారర్, థ్రిల్లింగ్ కూడా తోడైతే.. ప్రేక్షకుడిని మునివేళ్లపై నిలబెడుతుంది. తెరపై అరుదుగా కనిపించే ఇలాంటి కాంబినేషన్‌లో వచ్చిన చిత్రమే.. కింగ్‌స్టన్. తాజాగా జీ5 వేదికగా స్ట్రీమింగ్‌కు వచ్చి.. హిట్ టాక్‌తో దూసుకెళ్తున్నది. 1982లో తమిళనాడు సముద్ర తీరప్రాంతంలో ఉండే 'తూవత్తూర్' అనే గ్రామంలో జరిగే కథ ఇది. పల్లెలోని జాలర్లందరికీ సముద్రంలోని చేపలు పట్టడమే జీవనాధారం. కొన్ని కారణాల వల్ల గ్రామానికి చెందిన బోసయ్యను గ్రామస్థులంతా కొట్టి చంపుతారు. అతని శవాన్ని పేటికలో పెట్టి.. సముద్రంలో జలసమాధి చేస్తారు. అప్పటి నుంచి సముద్రంలోకి వేటకు వెళ్లిన జాలర్లు.. శవాలుగా తీరానికి కొట్టుకొస్తుంటారు. 'బోసయ్య ప్రేతాత్మే' అందుకు కారణమని అందరూ భయపడుతారు. మూఢ నమ్మకాలతో సముద్రానికి ఆడపిల్లలను 'బలి' ఇస్తుంటారు. దాంతో ప్రభుత్వం అక్కడ చేపల వేటను నిషేధిస్తుంది. ఫలితంగా.. ఊరి ప్రజలంతా ఉపాధిని కోల్పోతారు. ఇదే అదునుగా థామస్ (సబుమాన్ అబ్దుసమద్) ముఠా.. ఉపాధి పేరుతో తూవత్తూర్ యువకుల్ని అసాంఘిక కార్యకలాపాల్లోకి లాగుతుంది. కింగ్‌స్టన్ అలియాస్ కింగ్ (జీవీ ప్రకాశ్)తోపాటు ఇంకొందరు యువకులు ఆ ముఠాలో చేరుతారు. ఈ క్రమంలో సముద్రంపై కింగ్‌స్టన్‌కు ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? థామస్ అక్రమ వ్యవహారాలు ఎలా బయటపడతాయి? కింగ్‌స్టన్ గతం ఏంటి? అనే అంశాలు థ్రిల్‌ను పంచుతాయి.

